



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 195 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప శనివారం 21 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :195 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA SAT 21 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# అదో కాగితపు పులి.. పిరికివాళ్లు

## నాటో దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

- ఇరాన్‌తో యుద్ధంలో కలిసి రావడానికి ఇష్టపడడంలేదన్న ట్రంప్
- ఇప్పుడు అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం
- హర్మూజ్ జలసంధిని తెరవడానికి రావడం లేదని విమర్శ
- ఈ పిరికివాళ్లను గుర్తుంచుకుంటామని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:హర్మూజ్ జలసంధిని తెరవడానికి ముందుకు రావాలని తాను చేసిన విజ్ఞప్తిని నాటో దేశాలు పట్టించుకోకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటో దేశాల వ్యవహారశైలిపై తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా చిందులు వేశారు. అమెరికా లేని 'నాటో' ఓ కాగితపు పులి అని, అమెరికా లేకుండా ఏమీ చేయలేదని మండిపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో చేరనందుకు, హర్మూజ్ జలసంధిని తెరవడంలో సహకరించనందుకు వారిని గుర్తించుకుంటామని హెచ్చరిక చేశారు."అమెరికా లేకుండా నాటో ఒక పేపర్ టైగర్ వంటిదే. అణ్వాయుధాలు కలిగిన ఇరాన్‌ను ఆపడానికి జరుగుతున్న యుద్ధంలో వారు చేరడానికి ఇష్టపడటం లేదు.

మిగతా 2లో


# యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా చేసిన విజ్ఞప్తిని తిరస్కరించాం

## శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార

- రెండు యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా విజ్ఞప్తి చేసిందన్న శ్రీలంక అధ్యక్షుడు
- యుద్ధంలో తటస్థ వైఖరిని అనుసరిస్తున్నట్లు వెల్లడి
- శ్రీలంక పార్లమెంటుకు తెలిపిన అధ్యక్షుడు అనురకుమార

మిగతా 2లో





# ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...

## ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి మృతి


- ఇరాన్ ఉన్నతాధికారులే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు
- ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి అలీ మహ్మద్ నయీనీ మృతి
- ఇది పిరికిపంద చర్య అని, ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరిక
- ఇటీవల ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి, జాతీయ భద్రతా మండలి కార్యదర్శి కూడా మృతి

మిగతా 2లో

# పెట్రోల్, డీజిల్ కొరత రాకుండా చూడాలి


## పెట్రోల్, డీజిల్ పై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

- ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సూచన
- అకాల వర్షాలతో రాష్ట్రంలో రూ. 62 కోట్ల మేర పంట నష్టం అంచనా
- మొక్కజొన్న, వరితో పాటు ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం



పెన్ పవర్ డెస్క్:ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసుపై (గ్లోబల్ సప్లయ్ చైన్) తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎరువుల కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైన నిల్వల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇంధన సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా (పీఎన్‌జీ), ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను పటిష్ఠం చేయాలని స్పష్టం చేశారు. ఎల్పీజీ సరఫరా వ్యవస్థను సమీక్షిస్తూ... గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు విద్యా సంస్థలు, ఆలయాలకు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో



# కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల చేరుకున్న సీఎం చంద్రబాబు

- తిరుమల చేరుకున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, బ్రహ్మణి, దేవాన్ష్
- రాత్రికి తిరుమల చేరుకోనున్న నారా లోకేశ్
- రాత్రికి తిరుమలలో బస చేయనున్న సీఎం, ఆయన కుటుంబసభ్యులు
- దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి దర్శనం
- అన్నప్రసాదం ట్రస్టుకు రూ.44 లక్షలు విరాళం ఇవ్వనున్న కుటుంబం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుమల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన ఆయన వెంట అర్ధాంగి భువనేశ్వరి, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్ ఉన్నారు. ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేశ్ రాత్రికి తిరుమలకు చేరుకోనున్నారు. శనివారం (మార్చి 21) నారా లోకేశ్ తనయుడు దేవాన్ష్ పుట్టినరోజు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులంతా కలిసి రేపు ఉదయం శ్రీవారిని దర్శించుకుని, స్వామివారి సేవలో పాల్గొననున్నారు. దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని నారా వారి కుటుంబం తరఫున ప్రతి ఏటా కొనసాగిస్తున్న ఆనవాయతీ ప్రకారం, ఈసారి కూడా శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు భారీ విరాళం అందించనున్నారు.

మిగతా 2లో



# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు సుప్రీంకోర్టు కీలక తీర్పు

- అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్య ప్రేరేపణ కాదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- గుజరాత్‌కు చెందిన వ్యక్తిపై నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేత
- సూసైడ్ నోట్‌లో బెదిరింపుల వివరాలు లేవని పేర్కొన్న ధర్మాసనం
- అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని వ్యాఖ్య
- గుజరాత్ హైకోర్టు ఉత్తర్వులను పక్కనపెట్టిన సర్వోన్నత న్యాయస్థానం

మిగతా 2లో

# అవినాశ్ రెడ్డి నటన ఆస్కార్ రేంజ్‌లో ఉంది

- చంద్రబాబుకు సునీత సహకరిస్తోందన్న అవినాశ్ వ్యాఖ్యలపై బీటెక్ రవి మండిపాటు
- సునీతకు రాజకీయ కోరిక ఉంటే అవినాశ్ స్థానంలో ఆమె ఎంపీ అయ్యేవారని వ్యాఖ్య
- వివేకా హత్య కేసులో అవినాశ్ శిక్ష నుంచి తప్పించుకోలేరన్న బీటెక్ రవి

మిగతా 2లో



# ఇది నిరుద్యోగులను వంచించడమే.. చంద్రబాబుది పచ్చి మోసం

- ఉగాదికి 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం
- ఇది నిరుద్యోగులను మోసం చేయడమేనంటూ తీవ్రంగా విమర్శించిన షర్మిల
- రాష్ట్రంలో 1.80 లక్షల ఖాళీలుంటే పదివేల పోస్టులేంటని ప్రశ్న
- వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీత
- ఉద్యోగాలకు వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచాలని డిమాండ్

మిగతా 2లో



# ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత... లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు



- పారిశ్రామిక డీజిల్ ధరకు రెక్కలు
- లీటరు ధర రూ.87 నుంచి రూ.109కి చేరిన ఇండస్ట్రియల్ డీజిల్
- ప్రీమియం పెట్రోల్ ధరలు కూడా లీటరుకు రూ.2 పెరిగిన వైనం
- ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతోనే అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరలు
- ఉత్పత్తి ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని ఆందోళన

మిగతా 2లో

# నాడు పాదయాత్రలో లోకేశ్ మాట... నేడు జాబ్ క్యాలెండర్‌తో బాట



- 10,060 ఉద్యోగాలతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- 20 నెలల్లోనే 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించామని వెల్లడించిన మంత్రి పార్థసారథి
- వైసీపీ హయాంలో యువత, హిందూ మనోభావాలు దెబ్బతిన్నాయని తీవ్ర విమర్శలు
- రాష్ట్రంలోని 12.5 లక్షల మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం
- జగన్‌కు హిందూ ధర్మంపై గౌరవం లేదన్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

మిగతా 2లో

# జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి అన్యాయం చేశాడు



## వైఎస్ విజయమ్మ సంచలన ప్రకటన

- వైఎస్ కుటుంబ ఆస్తుల వివాదంపై స్పందించిన విజయమ్మ
- ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల
- షర్మిలకు రాసిన ఆస్తులు న్యాయంగా ఆమెకు చెందినవేనని వెల్లడి
- ఆస్తుల విషయంలో జగన్ అన్యాయం చేశారని లేఖలో ఆవేదన
- వైఎస్సార్ ఆదేశానుసారం ఆస్తులు నలుగురు మనుమలకు పంచాలని వివరణ

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# హోర్ముజ్.. ఇరాన్ కొత్త రూల్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి వంటి హోర్ముజ్ జలసంధి. ఇది ఇప్పుడు సరికొత్త దౌత్య యుద్ధానికి వేదికైంది. యుద్ధం అంటే కేవలం క్షిపణుల ప్రయోగమే కాదు, వ్యూహాత్మక ఎత్తుగడల చదరంగం అని ఇరాన్ మరోసారి నిరూపిస్తున్నది.ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ప్రతిపాదిం చిన 'కొత్త ప్రాంతీయ ప్రోటోకాల్' సహజ సిద్ధమైన జలమార్గాన్ని తన సొంత ఆస్తిగా మార్చుకోవడంతో పాటు అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బకొట్టాలన్న ఇరాన్ దీర్ఘకాలిక ఎత్తుగడగా పరిగణించాలి. మరోవైపు, ఈ సంక్షోభం అట్లాంటిక్ మహాసముద్రం ఇరువైపులా ఉన్న మిత్ర దేశాల మధ్య ఐక్యతను కుప్పకూల్చుతున్నది. మొత్తానికి హోర్ముజ్ చుట్టూ ముదురుతున్న ఈ మంటలు కేవలం చమురు ధరలనే కాదు.. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న అంతర్జాతీయ దౌత్య సమీకర ణాలను కూడా మార్చేలా కనిపిస్తున్నాయి. ఇరాన్ ఓటమి అంచున ఉన్నది. ఏ క్షణమైనా ముందు బేషరతుగా లొంగిపోవచ్చని అమెరికా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని.. ఇరాన్ తాజా ప్రతిపాదనలు నిరూ పిస్తున్నాయి. తాజాగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ఒక కీలక ప్రతిపాదన చేశారు. యుద్ధం ముగిసిన తర్వాత హోర్ముజ్ జలసంధిలో 'కొత్త ప్రాంతీయ ప్రోటోకాల్' ఉండాలని పశ్చిమ దేశాల నౌకలు ఈ మార్గంలో వెళ్లాలంటే ఇరాన్ విధించే కొత్త షరతులకు తలవొంచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓవైపు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ 'హోర్ముజ్ జలసంధిని తెరవడానికి మిత్రదేశాలన్నీ సైన్యాన్ని పంపాలి' అని పిలుపునిచ్చారు. కానీ యూరప్ స్పందన భిన్నంగా ఉంది. జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు అమెరికా యుద్ధ ప్రయత్నాల్లో నేరుగా చేరడానికి నిరాకరిస్తున్నాయి. అమెరికా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల వల్ల తాము ఇరాన్ ప్రతీకార దాడులకు లక్ష్యంగా మారకూడదని అవి భావిస్తున్నాయి. అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన ఉత్పత్తిదారు కాబట్టి ఈ చమురు ధరల పెరుగుదల దానికి పెద్ద దెబ్బ కాదు. కానీ యూరప్ ఇంధనం కోసం గల్ఫ్ దేశాలపై ఆధార పడుతుంది. అమెరికా ఆంక్షలతో రష్యా ఇంధనాన్ని కూడా వదులుకోవడంతో గ్యాస్ ధరలు 20% పెరగడం యూరప్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నది. హోర్ముజ్ ద్వారా వచ్చే 60% చమురు సరఫరా నిలిచిపోవడంతో భారత్ ఇప్పటికే రష్యా నుండి వచ్చే చమురుపై ఆధారపడటం పెంచింది. ఇరాన్ నుండి రెండు ఇండియన్ ఎల్‌పీజీ ట్యాంకర్లకు మినహాయింపు లభించడం మనకు భారీగా ఊరట లభించింది.

అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ నౌకలు మినహా మిగిలిన వాణిజ్య నౌకలు 'ఇన్నోసెంట్ పాసేజ్' కింద ఎవరి అనుమతి లేకుండానే హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లవచ్చు. కానీ, ఇరాన్ మాత్రం స్పష్టంగా ఒక మాట చెప్తున్నది. యుద్ధానికి ముందున్న విధానాలు పూర్తిగా మారాల్సిన అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో ఇరాన్ విధించే కొత్త షరతులు ఇలా ఉండే అవకాశం ఉన్నది. హోర్ముజ్ గుండా వెళ్లే ప్రతి నౌక 72 గంటల ముందే ఇరాన్ కోస్ట్ గార్డ్‌కు సమాచారం ఇచ్చి, అనుమతి తీసుకోవాలి. దీనివల్ల ఏ నౌకలో ఏముందో నిఘా పెట్టే అధికారం ఇరాన్‌కు వస్తుంది. హోర్ముజ్ జలసంధిలో భద్రతను ఇరాన్, ఒమన్ మాత్రమే చూస్తాయి.. కాబట్టి వెళ్లే ప్రతి నౌక కొంత మొత్తాన్ని 'సెక్యూరిటీ సర్‌చార్జ్'గా చెల్లించాలని కొత్త ప్రతిపాదన తెచ్చే అవకాశం ఉన్నది. గల్ఫ్ ప్రాంతానికి సంబంధం లేని దేశాల యుద్ధ నౌకలు, విమాన వాహక నౌకలు ఈ జలసంధిలోకి ప్రవేశించకూడదు.. ఒకవేళ రావాల్సి వస్తే ఇరాన్ నేతృత్వంలోని 'రీజినల్ కౌన్సిల్' అనుమతి తీసుకోవాల్సి ఉంటుం దనేది అన్ని షరతుల్లో కీలకమైనది.. ఇరాన్ చమురును కొనే దేశాల నౌకలకు మాత్రమే ఈ జలసంధిలో 'గ్రీన్ చానల్' కల్పిస్తామని, ఆంక్షలు పాటించే దేశాల నౌకలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని ఇరాన్ హెచ్చరిస్తోంది. నిజానికి సూయజ్ కాలువ మానవ నిర్మితం. ఇది పూర్తిగా ఈజిప్ట్ భూభాగం గుండా వెళ్తుంది. కాబట్టి, దానిపై ఈజిప్టుకు పూర్తి సార్వభౌమాధికారం ఉంటుంది. ఎవరిని అనుమతించాలి? ఎంత రుసుము వసూలు చేయాలి? అనేది ఈజిప్ట్ ఇష్టం. హోర్ముజ్ జలసంధి పూర్తిగా సహజసిద్ధమైన జలమార్గం. పైగా ఇది అంతర్జాతీయ జలసంధి. దీని ఒక వైపు ఇరాన్, మరోవైపు ఒమన్ దేశాలు ఉన్నాయి. దీనిపై ఏ ఒక్క దేశానికీ పూర్తి హక్కు ఉండదు. సముద్ర చట్టాలపై అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ జలసంధుల గుండా వెళ్లే నౌకలకు 'నిరంతర, వేగవంతమైన ప్రయాణం' చేసే హక్కు ఉంటుంది. దీనిని ఏ దేశం అడ్డుకోకూడదు, రుసుము వసూలు చేయకూడదు. ఇరాన్ ఈ ఒప్పందంపై సంతకం చేసినా, దానిని పూర్తిగా ఆమోదించలేదు. అందువల్ల, తమ ప్రాంతీయ జలాల గుండా వెళ్లే నౌకలపై నియంత్రణ మాకు ఉండాలని ఇరాన్ వాదిస్తోంది. 'ఇరాన్ పెడుతున్న షరతులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. మేము వీటిని అంగీకరించం. అవసరమైతే బల ప్రయోగం చేస్తాం' అని అమెరికా అంటోంది. అమెరికా మొండిగా వెళ్తే ఇరాన్ పూర్తిగా జలసంధిని మూసేస్తుంది. ఫలితంగా చమురు, గ్యాస్ సరఫరా ఆగిపోతే యూరప్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. అందుకే ఇరాన్‌తో చర్చలు జరిపి ఏదో ఒక మధ్యేమార్గం చూడాలని ఆ దేశాలు అమె రికాపై ఒత్తిడి తెస్తున్నాయి. మొత్తానికి పరిస్థితి చూస్తే యూరప్ దేశాలు అమెరికాను ఒప్పించి.. ఇరాన్‌పై ఉన్న కొన్ని ఆర్థిక ఆంక్షలను సడలించే అవకాశం ఉంది. దీనికి ప్రతిగా ఇరాన్ ప్రతిపాదిస్తున్న 'కొత్త ప్రోటోకాల్' డిమాండ్లలో కొన్ని వెనక్కి తీసుకునేలా ఒప్పందం కూడా కుదిరే అవకాశం ఉన్నది. హోర్ముజ్ జలసంధి గొంతుపై ఇరాన్ పెట్టిన కత్తితో యూరప్ సహా ప్రపంచ దేశాలు వణుకుతున్నాయనడంలో సందేహమే లేదు.

# నాడు పాదయాత్రలో లోకేశ్ మాట...
# నేడు జాబ్ క్యాలెండర్‌తో బాట

నాడు పాదయాత్రలో యువతకు ఇచ్చిన మాట ప్రకారం, నేడు జాబ్ క్యాలెండర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బాటలు వేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగంతో అల్లాడిన యువతకు తమ కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు 2.3 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, వారిని నిలువునా వంచించారని మంత్రి తీవ్రంగా విమర్శించారు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, గ్రాడ్యుయేట్లలో 24 శాతం మందికి ఉద్యోగాలు లేవని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయని గుర్తు చేశారు. ఉపాధి లేక రాష్ట్రంలో 4,100 మంది యువకులు ఆత్మహత్య చేసుకోవడానికి వైసీపీ ప్రభుత్వ అసమర్థతే కారణమని ఎన్సీఆర్బీ నివేదికను ఉటంకిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 20 నెలల కాలంలోనే రికార్డు స్థాయిలో 6,28,347 ఉద్యోగాలు కల్పించిందని పార్థసారథి గర్వంగా ప్రకటించారు. ఇప్పటికే 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, తాజాగా మరో 10,060 ఉద్యోగాలతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల ద్వారా 2.5 లక్షల మందికి, జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి ద్వారా 1,46,620 మందికి, ఐటీ, పర్యాటక రంగాల్లో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు చూపించామన్నారు. నాడు పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు.

**అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం**

ఉద్యోగ కల్పనతో పాటు సంక్షేమానికి కూడా తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దివ్యాంగుల సంక్షేమం కోసం చారిత్రక నిర్ణయం తీసుకున్నామని, ఫిబ్రవరి 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 12.5 లక్షల మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని ప్రకటించారు. సిటీ, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో పూర్తి ఉచితంగా, ఇతర బస్సుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేవలం 24 గంటల్లోనే రూ.45 కోట్లను ముస్లిం సోదరుల ఖాతాల్లో జమ చేశామని, పోలవరం నిర్వాసితులకు మూడు విడతల్లో రూ.1,943 కోట్ల పరిహారం అందించామని చెప్పారు. "మీసాలు తిప్పి, తొడలు కొట్టినంత మాత్రాన పనులు కావు, చిత్తశుద్ధి ఉండాలి" అని వైసీపీ నేతలకు చురకలు అంటించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ గత ఏడాది 16,000 మంది టీచర్లను నియమించామని, తాజా క్యాలెండర్‌లో 1,500 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నామని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

# పెట్రోల్, డీజిల్ కొరత రాకుండా చూడాలి

- మొదటి పేజీ తరువాయి

అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమావేశంలో, రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై కూడా ఆయన వరుసగా రెండో రోజూ సమీక్ష నిర్వహించారు. భారీ గాలులు, వడగళ్లతో కూడిన వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నష్టం వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని, దీని విలువ సుమారు రూ.40 కోట్లుగా ఉంటుందని తెలిపారు. అలాగే, 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, మామిడి, నిమ్మ, నారింజ వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు.

ఈ నష్టం విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేశారు. మొత్తం మీద రాష్ట్రవ్యాప్తంగా రూ.62 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు నివేదించారు.

# అవినాశ్ రెడ్డి నటన ఆస్కార్ రేంజ్‌లో ఉంది

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ సెగలు పుట్టిస్తోంది. కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్‌పై పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి నిప్పులు చెరిగారు. కడపలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, అవినాశ్ రెడ్డి నటన చూస్తుంటే ఆస్కార్ అవార్డు ఇచ్చే రేంజ్‌లో ఉందని ఎద్దేవా చేశారు. వివేకా కుమార్తె సునీత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సహకరిస్తున్నారన్న అవినాశ్ వ్యాఖ్యలపై బీటెక్ రవి తీవ్రంగా స్పందించారు. "సునీతకు గనుక రాజకీయ కోరిక ఉంటే... ఈరోజు అవినాశ్ రెడ్డి కడప ఎంపీ అయ్యేవారు కాదు. ఆ స్థానంలో సునీతమ్మే ఎంపీగా ఉండేవారు. కేవలం తన తండ్రిని చంపిన వారికి శిక్ష పడాలనే ఉద్దేశంతోనే ఆమె ఒంటరి పోరాటం చేస్తున్నారు తప్ప, ఇందులో రాజకీయాలు లేవు" అని స్పష్టం చేశారు.

వివేకా హత్య జరిగిన సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను బీటెక్ రవి ఈ సందర్భంగా సూటిగా ప్రస్తావించారు. "స్పాట్ పెట్టింది మీరు. స్పాట్‌కు వెళ్లింది మీరు. అక్కడ దగ్గరుండి సాక్ష్యాధారాలను క్లీన్ చేయించింది కూడా మీరే" అంటూ అవినాశ్ రెడ్డిపై ఆరోపణలు గుప్పించారు. వివేకా కేసులో ఎన్ని డ్రామాలు ఆడినా, సాక్ష్యాలను తారుమారు చేసినా... చట్టం ముందు అవినాశ్ రెడ్డి దోషిగా నిలబడక తప్పదని, శిక్ష నుంచి ఆయన తప్పించుకోలేరని అన్నారు.

# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది.

**కేసు నేపథ్యం ఏమిటంటే..**

గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురు అప్పుల వాళ్లు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఆ నోట్‌లో తొమ్మిది మంది రుణదాతల పేర్లను పేర్కొన్నాడు. వారిలో ఒకరైన ధీరూభాయ్ నంజీభాయ్ పటేల్ లోత్వాలాపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 506(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల వ్యవధిలో నిందితుడు సుమారు 40 సార్లు ఫోన్ చేసినట్లు కాల్ రికార్డులను ప్రాసిక్యూషన్ ఆధారాలుగా చూపింది. తనపై కేసును కొట్టివేయాలని ధీరూభాయ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

**సుప్రీంకోర్టు ఏమంది?**

ఈ కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని అభిప్రాయపడింది. "సూసైడ్ నోట్‌లో తొమ్మిది మంది పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టంగా లేదు. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు, ఎక్కడ జరిగాయనే వివరాలు లేవు. అందరు రుణదాతలను ఒకే గాటన కట్టారు. ఇలాంటి సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ జరపడం వృధా ప్రయాస అవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది.

అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని, కేవలం ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్, తదుపరి చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

# యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా చేసిన విజ్ఞప్తిని తిరస్కరించాం

మార్చి నెల ప్రారంభంలో శ్రీలంకలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు విమానాలను దిగడానికి అనుమతించాలని అమెరికా కోరగా, అందుకు నిరాకరించామని శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే ఆ దేశ పార్లమెంటుకు తెలిపారు. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో శ్రీలంక తటస్థ వైఖరి అనుసరిస్తోంది. ఈ క్రమంలో యుద్ధ విమానాలను దింపడానికి అనుమతించాలని అమెరికా విజ్ఞప్తి చేయగా శ్రీలంక తిరస్కరించింది. ఇదే విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు పార్లమెంటుకు తెలిపారు. మార్చి 4 నుంచి 8 తేదీల మధ్య జిబూటీలోని ఒక స్థావరం నుంచి రెండు క్షిపణి సామర్థ్యం కలిగిన విమానాలను మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించేందుకు అమెరికా అనుమతి కోరిందని అనురకుమార తెలిపారు. కానీ అమెరికా అభ్యర్థనను తిరస్కరించామని వెల్లడించారు.ఎన్నో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ తటస్థ వైఖరితో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నామని అన్నారు. పశ్చిమాసియా యుద్ధం ఎన్నోసవాళ్లను విసురుతోందని, అయినప్పటికీ ఏ పక్షానికి మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు. జిబూటీలోని ఒక స్థావరం నుంచి 8 యాంటీషిప్ మిసైల్స్‌తో కూడిన రెండు యుద్ధ విమానాలను మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకురావాలని అమెరికా భావించిందని అన్నారు.

# ఇది నిరుద్యోగులను వంచించడమే..
# చంద్రబాబుది పచ్చి మోసం

ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం 10,060 పోస్టులతో క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగ యువతను నమ్మించి నయవంచన చేశారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీలుంటే, ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల సంఖ్య "ఖాళీలు బారెడు.. నోటిఫికేషన్లు చారెడు" అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఉగాది రోజున సీఎం చంద్రబాబు 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. మే 15 నుంచి అక్టోబరు వరకు ఈ నియామకాలు పూర్తి చేస్తామని, ఇకపై ప్రతి ఏటా ఉగాదికి క్యాలెండర్ ఇస్తామని ప్రకటించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు.అయితే, ప్రభుత్వ ప్రకటనపై షర్మిల ఘాటుగా స్పందించారు. "కొండంత రాగం తీసి కూసంత పాట పాడినట్లు" కూటమి ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో చంద్రబాబు చేసింది పచ్చి మోసమని, ముష్టి 10 వేల పోస్టులకు షెడ్యూల్ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రెండేళ్లుగా నిరుద్యోగులను ఊరించి చివరకు ఉసూరుమనిపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వివిధ శాఖల్లోని ఖాళీలపై ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. "విద్యాశాఖలో 30 వేలు, పోలీస్ శాఖలో 19,999, ఇంజనీరింగ్ విభాగంలో 20 వేలు, పంచాయతీ రాజ్‌లో 26 వేలు, మున్సిపల్ శాఖలో 27 వేలు, రెవెన్యూలో 13 వేలు, వైద్యశాఖలో 26 వేల ఖాళీలను వెంటనే నింపుతామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు.రాష్ట్రంలోని 153 విభాగాల్లో కలిపి 1.80 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, రెండేళ్లకు కలిపి కనీసం 50 వేల ఉద్యోగాలనైనా భర్తీ చేయాల్సి ఉందని ఆమె అన్నారు. 50 లక్షల మంది నిరుద్యోగులున్న రాష్ట్రంలో ఇలాంటి క్యాలెండర్లు కాకుండా భారీ స్థాయిలో

ఖాళీలను భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. అలాగే, ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల దరఖాస్తుకు వయోపరిమితిని 42 నుంచి 46 ఏళ్లకు పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి ఎదురుచూస్తున్న యువతకు న్యాయం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

# కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల చేరుకున్న సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

ఒకరోజు అన్నవితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షలను టీటీడీకి విరాళంగా సమర్పించనున్నారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ రాత్రికి చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులు తిరుమలలోనే బస చేసి, రేపు ఉదయం దర్శనానంతరం తిరిగి బయలుదేరనున్నారు.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) మరోసారి ఇరాన్‌పై విరుచుకుపడింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అధికార ప్రతినిధి, పబ్లిక్ రిలేషన్స్ హెడ్ అలీ మహ్మద్ నయీనీని హతమార్చినట్లు శుక్రవారం ప్రకటించింది. గత రెండేళ్లుగా ఐఆర్‌జీసీకి ప్రధాన ప్రచారకర్తగా నయీనీ పనిచేస్తున్నారని ఐడీఎఫ్ తెలిపింది. ఇజ్రాయెల్‌పై ఉగ్రదాడులను ప్రోత్సహించేలా మధ్యప్రాచ్యంలోని ఉగ్రసంస్థలకు ఇరాన్ పాలన యంత్రాంగం యొక్క ఉగ్రవాద ప్రచారాన్ని వ్యాప్తి చేశారని ఆరోపించింది. మరోవైపు, పవిత్ర రంజాన్ మాసం చివరి గంటల్లో అమెరికా–ఇజ్రాయెల్ ఉగ్రదాడిలో తమ అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ అలీ మహ్మద్ నయీనీ 'అమరుడయ్యారని' ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఇది పిరికిపంద చర్య అని, ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఇజ్రాయెల్... ఇరాన్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులనే లక్ష్యంగా చేసుకుంటోంది. బుధవారం టెహ్రాన్‌లో జరిగిన వైమానిక దాడిలో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఎస్మాయిల్ ఖతీబ్‌ను హతమార్చినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. అంతకుముందు, ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీని కూడా హతమార్చినట్లు ప్రకటించింది. మార్చి 17న టెహ్రాన్‌లో జరిగిన దాడిలో లారిజానీ తన కుమారుడితో కలిసి మరణించినట్లు ఇరాన్ మీడియా కూడా ధృవీకరించింది. అంతేకాకుండా, బసిజ్ పారామిలిటరీ దళాల యూనిట్ కమాండర్ ఘోలామ్‌రెజా సోలేమానీని కూడా హతమార్చినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఇరాన్‌లో పౌర ప్రదర్శనకారులపై హింసకు, అణచివేతకు సోలేమానీ నాయకత్వం వహించారని ఐడీఎఫ్ ఆరోపించింది. ఇజ్రాయెల్ వరుస దాడులతో ఇరాన్ కీలక అధికారులను కోల్పోతుండటం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది.

# అదో కాగితపు పులి.. పిరికివాళ్లు

- మొదటి పేజీ తరువాయి

కానీ తక్కువ నష్టంతో మా సైన్యం విజయం సాధించింది. అయినప్పటికీ నాటో దేశాలు ఇప్పుడు తాము చెల్లించవలసి వస్తున్న అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. కానీ అధిక చమురు ధరలకు కారణమైన హర్మూజ్ జలసంధిని తెరవడానికి నాటో దేశాలు ఇష్టపడటం లేదు. ఒక సాధారణ సైనిక విన్యాసం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరవొచ్చు. కానీ సహకరించేందుకు వారు ముందుకు రావడం లేదు. వారు పిరికివాళ్లు, వారిని గుర్తుంచుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు.

# ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత...
# లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు

అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే బల్క్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ.22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది. సాధారణ వాహనాల్లో కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను కూడా లీటరుకు రూ.2.09 మేర పెంచారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.

# జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి అన్యాయం చేశాడు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య గత కొంతకాలంగా కొనసాగుతున్న ఆస్తుల వివాదం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై వారి తల్లి వైఎస్ విజయమ్మ స్వయంగా స్పందించారు. కుటుంబ ఆస్తుల పంపకాలపై పూర్తి స్పష్టతనిస్తూ ఆమె ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల చేశారు. ఆ నోటరీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లేఖలో ఆమె తన కుమారుడు జగన్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. "2009లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారి మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే (ఎశీఎఎఆఅవస ఖుఎఆశ్రీఎ ఖంంవ్ం). ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగ లేదు. అన్ని ఆస్తులను నలుగురు మనుమలకు సమానంగా పంచాలని వైఎస్సార్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్ళందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవే. అందుకే జగన్ ఎంవోయూ రాశాడు (నిజానికి తనకు తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ తో సహా ఎంవోయూలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదే. ఇచ్చాను అని చెప్తున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన డివిడెండ్ మాత్రమే). ఆస్తులు విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తన తల్లిగా ఆశిస్తున్నాను.

ఆస్తుల పంపకం జరగలేదు. షర్మిలకు ఇచ్చినటువంటి ఆస్తుల లాంటివే వైఎస్సార్ గారు జగన్ కు కూడా ఇచ్చారు. అది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరు ఎవరు? మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నా. దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అంటూ విజయమ్మ తన నోటరీలో పేర్కొన్నారు.

# వెయ్యికాయలకు రూ. 13వేలు నుంచి రూ.14 వేలే

**కాకినాడ మార్చి 19, పెన్ పవర్:** కేరళను తలపించే కొబ్బ రి అందాలు కోనసీమకు సొంతం.. ఉద్యాన పంటల్లో రైతులకు కొబ్బరి ఆదాయమే అధికం.. అయితే ఇప్పుడు మిడిల్ ఈస్ట్‌లో జరుగుతోన్న యుద్ధం కోనసీమ కొబ్బరికి కాస్త గడ్డుకాలంగా మారింది.. ప్రతీ రోజూ టన్నుల కొద్దీ కొబ్బరి స్వదేశీ మార్కెట్ కే కాక ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే కోనసీమ కొబ్బరి అమాంతంగా నిలిచిపోయాయి.. యుద్ధం ప్రభావంతో చెన్నై పోర్టుల్లో కొబ్బరి కంటైనర్లు ఎక్కడిక్కడే నిలిచిపోవడంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతులు లేక ధరలు పతనం అయ్యాయం టున్నారు కొబ్బరి రైతులు.. రంజాన్ తో గల్ఫ్ దేశాలకు ఎగుమతులు చేసి లాభాలు సంపాదిద్దామనుకున్న తరుణంలో యుద్ధమేఘా లు కొబ్బరి రైతులపై నీళ్లు చల్లాయంటున్నారు.గతంతో పోలిస్తే గల్ఫ్ దేశాలకు దక్షిణాది రాష్ట్రాల నుంచి కొబ్బరి ఎగుమతులు గణనీయంగా పెరిగాయని కొబ్బరి వ్యాపారులు చెబుతున్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కొబ్బరి ఎగుమతులు పెద్ద ఎత్తున జరుగుతోండగా కోనసీమ ప్రాంతం నుంచి కూడా తగ్గట్టుగానే ఎగుమతులుంటున్నాయంటున్నారు.. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో గల్ఫ్ దేశాల్లో కొబ్బరికి బాగా డిమాండ్ ఏర్పడింది. గల్ఫ్ దేశాల్లో రంజాన్ సందర్భంగా సాంప్రదాయ వంటకాల్లో కొబ్బరిని ఎక్కువగా వాడుతుంటారని, దీంతోపాటు ఆదేశ సౌందర్య, ఇతరాత్ర తయారీ సామాగ్రిలో కొబ్బరి వినియోగం బాగా పెరిగిందంటున్నారు. ఈ నేపథ్యంలోనే సౌదీ అరేబియా, కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, ఖతార్ దేశాలకు కొబ్బరి ఎగుమతులు జరుగుతుండగా రంజాన్ నేపథ్యంలోనే ఆ దేశాలకు కొబ్బరి ఎగుమతులు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. అయితే ఎగుమతి అయిన సరుకు పోర్టుల్లోని కంటెయినర్లలోనే చిక్కుకుపోయిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు..ప్రస్తుతం వెయ్యికాయలకు రూ. 13వేలు నుంచి రూ.14 వేలు ఉంది.. గతేడాది సెప్టెంబర్ నుంచి నవంబర్, డిసెంబర్ నెలల్లో రికార్డు స్థాయిలో రైతులు లాభాలు పొందారు.. వెయ్యికాయకు రూ. 27 వేలు వరకు ధర పలికింది.. కురిడీ కాయ గతంలో రూ. 30 వేలు నుంచి రూ. 35 వేలు వరకు వెళ్లింది..కానీ ఇప్పుడు రూ. 26 వేలు నుంచి రూ. 29 వేలు వరకు నడుస్తోంది.. రంజాన్ మాసంలో విదేశాలకు ఎగుమతులయ్యే సరుకుకు ఆశాజనకంగా లాభాలు ఆర్జించవచ్చని చూసిన రైతులకు, వ్యాపారులకు ఇరాన్ ఇజ్రాయేల్, అమె రికా యుద్ధం బాగా దెబ్బకొంటిందం టున్నారు. ఇక శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా కొబ్బరికి డిమాండ్ ఉంటుందనుకున్న రైతులకు ఇది కూడా ఊరట నివ్వని పరిస్థితి కనిపిస్తోంది.. నవమి తొమ్మిది రోజుల పాటు కొబ్బరికి డిమాండ్ ఉండగా అయితే ఉత్పత్తి బాగా పెరిగిపోవడంతో డిమాండ్ తగ్గింది..ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాలైన గల్ఫ్ ఏడు దేశాల్లో యుద్ధ వాతావరణంతో నిండిపోయింది.. ఇరాన్‌పై ఇజ్రాయేల్, అమెరికా సేనలు విరుచకుపడుతున్నాయి.. మరో పక్క దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఒమాన్, బెహ్రాయిన్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తుంది.. ఈ పరిస్థితుల నేపథ్యంలో ముంబయి, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే కొబ్బరి కాయలతో కంటెయినర్లు నిలిచిపోయాయని అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు సంబంధించిన కొబ్బరి రైతులు చెబుతున్నారు. యుద్ధం ఎప్పుడు ముగు స్తుందో.. ఆయా దేశాలకు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవు తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. ఈ నేప థ్యంలో ఆయా ఓడరేవుల్లో ఉన్న సరకును స్థానికంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు.. ఇదిలా ఉంటే యుద్ధ ప్రభావాన్ని చూపుతున్న వ్యాపారులు మరింత తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు..


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## మదనపల్లి ఫైల్స్ లో పెద్దిరెడ్డి చుట్టూ రాజకీయం

**తిరుపతి, మార్చి 19, పెన్ పవర్:**
ఏపీలో మరో కొత్త కేసు తెరపైకి వచ్చింది. మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో బుధవారం కీలక పరిణామం జరిగింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ముని తుకారాం, మాధవ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ముని తుకారాం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏ గా వ్యవహరించారు. మాధవరెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధానానుచరుడు. వీరిద్దరూ మదనపల్లె ఫైల్స్ కేసులో ఖ3, ఏ4 నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం నిరాకరించింది. ఈ నేపథ్యంలోనే వీరి అరెస్టు జరిగింది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ సంబంధమైన కేసులను తెరపైకి తెచ్చింది. ఈ క్రమంలో 2024 జూలై 21న మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటన అప్పట్లో సంచలనంగా మారింది. రెవెన్యూ ఫైల్స్ కాలిపోయాయి. అందుకే ఇది ప్రమాదం కాదని.. ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటన అని అనుమానిస్తూ పలు అభియోగాలు నమోదయ్యాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ ఘటనకు కారణమన్న అనుమానాలు బలపడ్డాయి.. ఈ నేపథ్యంలో ఘటన జరిగిన సమయంలో మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్, హరిప్రసాద్ లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆర్డీవోగా గతంలో పనిచేసిన మురళి అనే అధికారిపై కూడా చర్యలు తీసుకున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో అవకతవకలు బయటపడకుండా ఉండేందుకుగాను ఈ ఘాతుకానికి పాల్పడ్డారన్న అనుమానాలు ఉన్నాయి. అందుకే ఏపీ ప్రభుత్వం 2024 ఆగస్టులో మదనపల్లి ఫైల్స్ కేసును సీబీసీఐడీకి అప్పగించింది. అందులో భాగంగా సిఐడి అధికారులు గౌతమ్ తేజ్ తో పాటు పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి, మురళిలను అరెస్టు చేశారు. అయితే సాంకేతిక కారణాలతో మాధవరెడ్డికి కోర్టు రిమాండ్ విధించలేదు. దీంతో ఆయన బయటే ఉన్నారు. మరోవైపు ఏ 4 నిందితుడిగా ఉన్న ముని తుకారాం గత ఏడాది జూలైలో అమెరికా వెళ్ళిపోయారు. బుధవారం వీరిద్దరినీ ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాత్ర పై దర్యాప్తు ముమ్మరంగా సాగే ఛాన్స్ కనిపిస్తోంది. పెద్దిరెడ్డి చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్లు అర్థమవుతుంది.

## జగన్ ఒక వైపే చూస్తున్నారా... ఇబ్బందే మరి !

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక వైపే చూస్తున్నారు, ఒక వైపే ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఆయన మీడియా ముందు మాట్లాడుతున్న తీరు కానీ పార్టీ సమావేశాలలో ఇస్తున్న ప్రకటనలు కానీ చూస్తే ఒక విషయం అర్థం అవుతోంది ఏపీలో 2029 ఎన్నికల్లో వైసీపీని జనాలు తప్పకుండా ఎన్నుకుంటారని ధీమాతో ఉన్నారు. దానికి కారణం తాము చేసిన సంక్షేమ కార్యక్రమాలు అని బలంగా నమ్ముతున్నారు. తాజాగా తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన ఒంగోలు పార్టీ నేతల మీటింగులో సైతం జగన్ ఇదే విషయం గట్టిగా ప్రస్తావించారు.

**ప్రతీ ఇంట్లో చర్చ :**
తమ అయిదేళ్ల పాలన మీద కూటమి ఇరవై నెలల పాలన మీద ప్రతీ ఇంట్లో చర్చ సాగుతోందని జగన్ అంటున్నారు. తాము ఏకంగా రెండు లక్షల 70 వేల కోట్ల రూపయాల పై చిలుకు సంక్షేమంగా ప్రతీ ఇంటికీ నగదు బదిలీగా అందచేశామని జగన్ చెప్పారు. కరోనా లాంటి విపత్తు ఉన్నా వెనకాడలేదని ఆయన గొప్పగా చెప్పుకున్నారు. అందువల్ల కూటమి సూపర్ సిక్స్ సూపర్ సెవెన్ అని ఎన్ని చెప్పినా తమ లాగా జనాలకు సంక్షేమ పథకాలు అందించడంతో విఫలం అవుతోంది అని అన్నారు. ఈ తేడాను ఇప్పటికే జనాలు గుర్తించారని అందుకే తమకే పట్టం కడతారని జగన్ అంటున్నారు. ఆయన వరకూ ఈ విశ్లేషణ బాగుంది, అందులో కొంత నిజం ఉంది, కానీ కేవలం సంక్షేమం విషయాన్ని మాత్రమే జనాలు పరిగణనలోకి తీసుకుని ఓట్లేస్తారా అన్న చర్చ సాగుతోంది.

**అభివృద్ధి మంత్రంతో :**
ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే అభివృద్ధి అని అంతా చెబుతారు. ఆయన సంక్షేమం కంటే దానికే ఎక్కువ ఫోకస్ పెడతారు. అలాంటి బాబు ఏపీలో వైసీపీని గట్టిగా దెబ్బ తీయాలని సంక్షేమం రూట్ కూడా ఎంచుకున్నారు. అలా బాబు ఒక వైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి రెండింటికీ బ్యాలెన్స్ చేస్తూ వస్తున్నారు. ఆయన ప్రతీ మీటింగులోనూ ఈ రెండూ చెబుతున్నారు. అమరావతి రాజధాని ప్రగతిని వివరిస్తున్నారు. పోలవరం ఎపుడు పూర్తి అవుతుందో చెబుతున్నారు. పెట్టుబడులు ఏపీకి ఎన్ని వచ్చాయో ఎన్ని ఉద్యోగాలు వస్తున్నాయో డేటాతో సహా వివరిస్తున్నారు. అంతే కాదు ఉత్తరాంధ్రా అమరావతి తిరుపతిలను ఎకనామిక్ జోన్లుగా చేస్తూ మూడు రీజియన్లను అభివృద్ధి చేస్తున్నారు. ఆ యాక్షన్ ప్లాన్ ని ప్రకటించారు. అలాగే ప్రతీ ప్రాంతంలో ఉన్న సహజ వనరులకు తగినట్లుగా పారిశ్రామిక అభివృద్ధి చేస్తున్నారు. అభివృద్ధి వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలకు సమ ప్రాధాన్యత ఉండేలా చూసుకుంటున్నారు. విజన్ 2047 అని ఒక భారీ బ్లూ ప్రింట్ తో బాబు ముందుకు సాగుతున్నారు.

**జగన్ విజన్ ఏమిటి :**
మరి సంక్షేమం విషయం వరకూ జగన్ ఓకే అనుకున్నా అభివృద్ధి విజన్ ఏదీ అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏపీలో అయిదు కోట్ల మంది ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారు. అలాగే ఉపాధి అవకాశాలు వారు ఆశిస్తున్నారు. వైసీపీ ఈ రోజుకీ రాజధాని విషయంలో క్లారిటీని ప్రకటించలేకపోతోంది. అలాగే పోలవరం ప్రాజెక్ట్ ని తమ హయాంలో పూర్తి చేయలేక పోయింది. ఏపీలో మూడు ప్రాంతాలలో తమదైన అభివృద్ధి అజెండా నమూనాను ఆవిష్కరించడంలో వెనకబడుతోంది అని అంటున్నారు. ఏపీ అంటే సంక్షేమ పథకాలను అందుకునే లబ్దిదారులు మాత్రమే ఉండరని, మధ్యతరగతి ఉన్నత తరగతి వర్గాలు కూడా ఉంటాయని గుర్తు చేస్తున్నారు వీరంతా డెవలప్మెంట్ కోరుకుంటారు అని చెబుతున్నారు. వైసీపీ ఎంతసేపూ తమ విధానంతోనే ముందుకు పోతే ఇబ్బందులు వస్తాయని అంటున్నారు. ఇప్పటికి అయినా మించిపోయింది లేదని వైసీపీ తన డెవలపమెంట్ స్ట్రాటజీస్ ఏమిటి ఏపీని ఎలా ముందుకు తీసుకుని వెల్దామనుకుంటున్నది జనాలకు తరచూ వివరించే ప్రయత్నం చేయకపోతే 2029 ఎన్నికల్లో కూడా కూటమి నుంచి భారీ సవాల్ ఎదురవుతుందని అంటున్నారు.

## మహేష్ పై వేటుకు రంగం సిద్ధం..

**విజయవాడ, మార్చి 19, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఇంటికే అన్న పేరుంది. డ్రగ్స్ వివాదంలో చిక్కుకున్న పుట్టా మహేష్ యాదవ్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరి చూస్తుంటే, ఆయన రాజకీయ భవిష్యత్తుపై క్లారిటీ వచ్చేసింది. “పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే వాళ్లను మోయాలా?” అంటూ బాబు వేసిన ప్రశ్న.. మహేష్‌పై వేటుకు రంగం సిద్ధమైందనేదానికి నిదర్శనంతిరుపతి జిల్లా నేతతో జరిగిన భేటీలో చంద్రబాబు ఆవేశం కట్టలు తెంచుకుంది. సాధారణంగా ఇలాంటి వ్యక్తిగత ఆరోపణలు వచ్చినప్పుడు ఆచి తూచి స్పందించే బాబు, ఈసారి మాత్రం ఏకంగా “పార్టీకి వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది? డ్రగ్స్ తీసుకోవడం ఏంటి?” అని నిలదీశారు. పుట్టా మహేష్ వ్యవహారం కేవలం ఒక వ్యక్తి పొరపాటు కాదని, అది ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించే అంశమని అధిష్టానం భావిస్తోంది.పుట్టా సుధాకర్ యాదవ్ వంటి విధేయుడైన నేతకు తనయుడిగా, యనమల రామకృష్ణుడు వంటి దిగ్గజానికి అల్లుడిగా మహేష్‌కు పార్టీలో రెడ్ కార్పెట్ పరిచారు. కానీ, ఆ గౌరవాన్ని కాపాడుకోవడంలో ఆయన విఫలమయ్యారు. కుటుంబ నేపథ్యం చూసి అవకాశం ఇచ్చాం, కానీ దాన్ని దుర్వినియోగం చేశారన్న బాబు మాటలు.. వారసత్వ రాజకీయం ఇకపై షీల్డ్‌లా పనిచేయదని స్పష్టం చేస్తున్నాయి. గతంలో కూడా తప్పు చేసిన వారిని ఉపేక్షించలేదని గుర్తు చేస్తూ, ఇప్పుడు కూడా అదే కఠిన ఫార్ములాను అమలు చేసేందుకు బాబు మొగ్గు చూపుతున్నారు.

## లాలూచీ పాలిటిక్స్: తిరుపతి నేతలకు బాబు వార్నింగ్ ..!

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులతో తాజాగా టిడిపి అధినేత చంద్రబాబు సమావేశం అయ్యారు. నాలుగు గోడల మధ్య జరిగిన ఈ సమావేశంలో కొంతమంది నాయకులకు ఆయన సీరియస్ గానే కొన్ని విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ముఖ్యంగా లాలూచీ రాజకీయాలు చేస్తున్నారన్న వాదన కొన్నాళ్లుగా వినిపిస్తున్న నేపథ్యంలో ఇటువంటి పాలిటిక్స్ కి దూరంగా ఉండాలని చంద్రబాబు తేల్చి చెప్పినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే దూకుడు, లేకపోతే లాలూచీ రాజకీయాలు చేస్తున్నారన్న వాదన వినిపిస్తున్న మూడు నియోజకవర్గాల్లో పరిస్థితులపై ఆయన సమీక్షించారు.



వారి వారి గ్రాఫ్ ను కూడా ఆయన వివరించారు. అంతేకాదు ప్రజల మధ్య ఉండని నాయకులను పక్కన పెడతానని కూడా హెచ్చరించారు. ప్రధానంగా సుదీర్ఘకాలంగా ఎదురుచూసిన ఒక కీలక నియోజకవర్గంలో గత ఎన్నికల్లో టిడిపి తరఫున సీనియర్ నాయకుడు విజయం సాధించారు. అయితే ఎమ్మెల్యేగా ఆయన ఉన్నప్పటికీ ఆయన సతీమణి ఆ నియోజకవర్గంలో చక్రం తిప్పడం పట్ల సొంత పార్టీలోనే విమర్శలు వచ్చాయి. ప్రధానంగా పార్టీ నాయకులను దూరం పెట్టి వ్యాపారాలు వ్యవహారాలు సాగిస్తున్నారని ఆమెపై వస్తున్న ప్రధాన విమర్శ.అదే విధంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా ఎవరికి వారుగా నాయకులు వ్యవహరిస్తున్న తీరుపట్ల చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. ఎవరు గెలిచారు అన్నది కాదు.. కూటమి తరపున అందరు కలిసి పనిచేయాలని ఆయన పదేపదే సూచిస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో కొంతమంది నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాలను ప్రామాణికంగా తీసుకున్న ఆయన వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. అంతేకాదు ఎక్కడా ప్రత్యర్థులతో లాలూచీ పడద్దని.. వారితో కలిసి వ్యాపారాలు వ్యవహారాలకు దూరంగా ఉండాలని కొంత కఠినంగానే చెప్పినట్టు తెలిసింది.సత్యవేడు నియోజకవర్గంలో ఇన్చార్జిగా ఉన్న శంకర్రావు ప్రస్తుతం దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇది పార్టీకి నష్టం కలిగించకుండా చూసుకోవాలని ఆయనకు సూచించారు. అదేవిధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలను ప్రధానంగా ప్రస్తావించిన చంద్రబాబు కుటుంబ సభ్యులను పక్కనపెట్టి ప్రజల మధ్యకు వెళ్లాలని ఆయన తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఆయన నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులు వ్యవహరిస్తున్న తీరు పట్ల వస్తున్న ఫిర్యాదులు అదేవిధంగా పార్టీ రూపొందించిన నివేదికలను కూడా చంద్రబాబు వారి ముందు ఉంచి వారికి వివరించారు. భవిష్యత్తులో తిరుపతి జిల్లాను మోడల్ జిల్లాగా మార్చాలని నిర్ణయించుకున్నామని ఈ క్రమంలో అందరూ కలిసికట్టుగా అభివృద్ధి విషయంలో ముందుకు సాగాలని కూడా తేల్చి చెప్పారు. తిరుపతి అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడేది లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇక వైసిపి పై విమర్శలు చేయడంలో వెనకబడుతున్న వారిని కూడా ఆయన మందలించారు. తిరుమల శ్రీవారి లడ్డు విషయంలో వచ్చిన ఆరోపణల అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ పై వచ్చిన విమర్శలను సమర్థవంతంగా తిప్పి కొట్టలేకపోయారని సీనియర్ నాయకులను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇట్లాంటివి వచ్చినప్పుడే కదా మీ సత్తా తెలుస్తుంది అని కూడా తేల్చి చెప్పారు. పనితీరు మార్చుకోవాలని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎవరిని ఉపేక్షించేది లేదని, లాలూచీ రాజకీయాలను అసలు సహించేది లేదని కూడా చంద్రబాబు స్పష్టం చేయడం గమనార్హం. మరి ఏ మేరకు తిరుపతి నాయకులు మారతారు అనేది చూడాలి.

## ఏప్రిల్ 2తో ముగియనున్న సర్పంచ్ ల పదవీల కాలం

**విజయవాడ, మార్చి 19, పెన్ పవర్:**
రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో గ్రామ పాలనపై ఆసక్తికర పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ ఎలా ఉండబోతుందన్న దానిపై స్పష్టత కోసం ప్రజలు, స్థానిక నాయకులు ఎదురు చూస్తున్నారు. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. అభివృద్ధి కార్యక్రమాల అమలు, మౌలిక వసతుల కల్పన, కేంద్రరాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం వంటి బాధ్యతలను ఈ ఐదేళ్లలో నిర్వర్తించారు. రహదారులు, తాగునీటి పథకాలు, పారిశుధ్య కార్యక్రమాలు, వీధి దీపాల ఏర్పాటు, చెత్త నిర్వహణ వంటి అంశాల్లో కొంతమేర అభివృద్ధి కనిపించినప్పటికీ, నిధుల కొరత, అధికార పరిమితులు, వివిధ శాఖల మధ్య సమన్వయం లోపం వంటి సమస్యలు కూడా ఎదురయ్యాయని పలువురు సర్పంచ్‌లు చెబుతున్నారు.పదవీకాలం ముగిసే సమయానికి గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రారంభమైన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొత్త ఎన్నికలు జరిగే వరకు పెద్దస్థాయి అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవచ్చని తెలుస్తోంది.సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీల పరిపాలన కొనసాగించడానికి ప్రభుత్వం తాత్కాలిక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు లేదా మండల స్థాయి అధికారులకు ప్రత్యేక అధికారాలు ఇచ్చి పరిపాలన కొనసాగించే విధానం అమలులో ఉంటుంది. ఈసారి కూడా అలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. కొత్త ఎన్నికలపై స్థానికంగా చర్చలు







మొదలయ్యాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే కొత్త అభ్యర్థుల పేర్లు వినిపిస్తున్నాయి. యువత, మహిళలు కూడా ఈసారి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో స్థానిక రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాధాన్యత, పార్టీ అనుబంధాలు వంటి అంశాలు కూడా రాబోయే ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.తమ పదవీకాలంలో గ్రామాభివృద్ధికి కృషి చేశామని చాలా మంది సర్పంచ్‌లు చెబుతున్నారు. అయితే నిధుల కొరత వల్ల అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోయామని కొందరు పేర్కొంటున్నారు. కేంద్రం నుంచి వచ్చే పంచాయతీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు సమయానికి అందకపోవడం కూడా సమస్యగా మారిందని అంటున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు తమ వ్యక్తిగత నిధులతో కూడా అభివృద్ధి పనులు చేపట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు.సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడే అవకాశముంది. పలు గ్రామాల్లో యువ నాయకులు, సామాజిక కార్యకర్తలు స్థానిక పాలనలోకి రావాలని ఆసక్తి చూపుతున్నారు. అదే సమయంలో ఇప్పటికే ఉన్న నాయకులు మళ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రామాభివృద్ధికి కొత్త దిశ చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం,
పారదర్శక పాలన అందించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం వంటి అంశాల్లో కొత్త నాయకత్వం కీలక పాత్ర పోషించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఏప్రిల్ 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండగా, గ్రామ పంచాయతీ పరిపాలనపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కీలకంగా మారింది. కొత్త ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చిన తర్వాత గ్రామాల్లో రాజకీయ చైతన్యం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఈ మార్పులు రాబోయే రోజుల్లో గ్రామ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి.

# వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా బీసీసీఐ మాస్టర్ ప్లాన్.. ఐపీఎల్‌పై సెలక్టర్ల కన్ను



**హైదరాబాద్ పెన్ పవర్:** వన్డే ప్రపంచకప్ 2027 టోర్నమెంట్‌కు ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ మెగా టోర్నీ కోసం సుమారు 20 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాబబుల్స్ జాబితాను సెలక్టర్లు ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా గమనించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పీటీఐ ఒక కథనంలో పేర్కొంది. సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎస్‌ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, ప్రగ్యాన్ ఓఝా.. ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా స్టేడియాల్లోనూ, టీవీల్లోనూ పర్యవేక్షించనున్నారు. ప్రతీ వారం కనీసం ఐదు మ్యాచ్‌లను కవర్ చేసేలా, ఒక్కో సెలక్టర్ ఒక్కో మ్యాచ్‌కు హాజరయ్యేలా ప్రణాళిక రచించినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ పర్యవేక్షణ కేవలం వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని మాత్రమే జరుగుతుందని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ లేదా టీ20 ప్రపంచకప్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్పష్టమైంది. సెలక్టర్లు ప్రధానంగా జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లపై దృష్టి సారించనున్నారు. మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న హర్షిత్ రాణాకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు జూన్ 6 నుంచి 10 వరకు ముల్లన్‌పూర్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు పూర్తిస్థాయి జట్టును పంపాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు లేనప్పటికీ, దీనిని తేలిగ్గా తీసుకోవడం లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు భారత్ తొమ్మిది టెస్టులు ఆడాల్సి ఉన్నందున, ఈ మ్యాచ్‌లో కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చే ఉద్దేశం లేదని తెలుస్తోంది. ఐపీఎల్ సమయంలో గాయపడకపోతే బుమ్రా, సిరాజ్ కూడా ఆఫ్ఘనిస్థాన్‌తో టెస్టు ఆడే జట్టులో ఉంటారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. “భారత టెస్టు జట్టు ప్రయోగాలకు వేదిక కాదు. దానికోసం ఇండియా-ఏ పర్యటనలు ఉన్నాయి. ప్రస్తుతం టెస్టుల్లో బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ మా మొదటి ప్రాధాన్యత” అని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు.

# క్రికెట్‌పై ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం సెగ.. ఇంగ్లాండ్‌లో బంతుల కొరత




**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్య ప్రాచ్యంలో ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య నడుస్తున్న యుద్ధం అంతర్జాతీయ క్రికెట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఈ యుద్ధం వలన ముఖ్యంగా ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ ఆధ్వర్యంలో జరిగే కౌంటీ క్రికెట్ సీజన్‌కి సెగ తగిలింది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్‌కు ముందు ఈ సమస్య తలెత్తింది. ఈ టోర్నీలో ఉపయోగించే ప్రముఖ డ్యూక్స్ బంతుల సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడింది. సాధారణంగా ప్రతి క్లబ్‌కు సరిపడా నిల్వలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 50 శాతం మాత్రమే ఇంగ్లాండ్ బోర్డు దగ్గర అందుబాటులో ఉన్నాయి. ఈ డ్యూక్స్ బంతులు ప్రధానంగా భారత్, పాకిస్తాన్ లాంటి దక్షిణాసియా దేశాల్లో తయారవుతాయి. అయితే మధ్యప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభంతో ఈ బంతులను ఇంగ్లాండ్‌కు రవాణా చేయడంలో పెద్ద ఎత్తున జాప్యం కొనసాగుతుంది. ఫ్యాక్టరీల్లో బంతులు సిద్ధంగా ఉన్నప్పటికీ, వాటిని ఎక్స్‌పోర్టు చేయడానికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిపై బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ సంస్థ యజమాని దిలీప్ జజోడియా మాట్లాడుతూ.. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల మేము పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం.. ఈ సీజన్ ప్రారంభానికి క్లబ్‌లకు కేవలం 50 శాతం బంతులనే ఇవ్వగలుగుతున్నాం.. మిగిలినవి తర్వాత అందించాల్సి వస్తోందని వెల్లడించారు. అంతేకాదు, విమానయాన సంస్థలు సరుకు రవాణా చేసేందుకు ముందుకు రావడం లేదని, రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయని బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ సంస్థ యజమాని దిలీప్ జజోడియా పేర్కొన్నారు. సాధారణంగా ఒక బాక్స్‌కు కిలోకు 5 డాలర్లు వసూలు చేసేవారు. కానీ ప్రస్తుతం అదే ధర 15 డాలర్లకు పెరిగిపోయింది అన్నారు. ఈ సంక్షోభం మరింత తీవ్రంగా మారితే, ప్రత్యామ్నాయంగా ఆస్ట్రేలియాకు చెందిన కూకబుర్రా బంతులను ఉపయోగించాల్సిన పరిస్థితి రావొచ్చని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు.

# సీఎస్కే ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎంఎస్ ధోనీకి దక్కని చోటు.. ఇర్ఫాన్ పఠాన్ ఏమన్నారంటే?






**హైదరాబాద్ పెన్ పవర్:** మరో వారం రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిసన్ ప్రారంభం కానుంది. కాగా ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ప్రస్తుత బ్యాటింగ్ శైలిని విశ్లేషిస్తూ, పఠాన్ తనదైన శైలిలో కామెంట్స్ చేశాడు. ఈ సందర్భంగా సీఎస్‌కే అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో ధోనీకి చోటు దక్కడం కష్టమని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంఎస్ ధోనీ గత కొన్ని సీజన్లుగా బ్యాటింగ్ చేసేందుకు లోయర్ ఆర్డర్ లో 7, 8 స్థానాల్లోనే వస్తున్నాడు. కేవలం ఒకటి లేదా రెండు ఓవర్లు మాత్రమే ఆడుతున్నారని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నారు. ధోనీ కేవలం రెండు ఓవర్లు ఆడటం ఆయన అభిమానులకు ఆనందాన్ని ఇవ్వవచ్చు కానీ, జట్టుకు మాత్రం పెద్దగా ఉపయోగపడదని తేల్చి చెప్పాడు. ఆయన ఆడాలనుకుంటే కనీసం నాలుగు ఓవర్లు బ్యాటింగ్ చేయాలి.. లేదంటే ఆ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించడం జట్టుకు మేలు చేస్తుంది అని పఠాన్ సూచించారు. గత ఐదు సీజన్లలో ఎంఎస్ ధోనీ ఎదుర్కొన్న బంతుల సంఖ్యను పరిశీలిస్తే అతడి బ్యాటింగ్ టైమింగ్ పూర్తిగా తగ్గుతూ వస్తోంది. గత 5 సీజన్లలో సగటున సీజన్‌కు 114 బంతులను మాత్రమే ఎదుర్కొన్నారు. ‘ఇంపాక్ట్ ప్లేయర్’ రూల్ వల్ల ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు రావడం సులభమైంది, అయితే ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాటర్ అయినా ఏదో ఒక సమయంలో రిటైర్మెంట్ ఇవ్వాల్సిందేనని భారత జట్టు మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ గుర్తు చేశారు.

**ఇర్ఫాన్ పఠాన్ ఎంచుకున్న ‘సీఎస్‌కే 12’:**

సంజు శాంసన్, ఆయుష్ మ్హాత్రే, రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), శివం దూబే,డెవాల్డ్ బ్రెవిస్ సర్ఫరాజ్ ఖాన్, కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్, అఖీల్ హొసేన్, మాట్ హెన్రీ,నూర్ అహ్మద్ ఖలీల్ అహ్మద్ (ఇంపాక్ట్ ప్లేయర్),

# సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న భామలు!



నభా నటేష్ స్టైల్ మరియు గ్రేస్‌తో...



తెలుగువారి కొత్త ఏడాది ‘ఉగాది’ పండుగను మన సినీ తారలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. కేవలం పండుగ జరుపుకోవడమే కాకుండా, పట్టుచీరలు, లంగా ఓణీల్లో అచ్చతెలుగు ఆడపడుచుల్లా ముస్తాబై సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేశారు. శాన్వీ మేఘన, వర్ష బొల్లమ్మ, నభా నటేష్ వంటి హీరోయిన్లు తమ అందచందాలతో అభిమానులకు కంటికి పండగ చేశారు. ఈ కొత్త ఏడాది అందరికీ మంచి జరగాలని కోరుకుంటూ వారు పంచుకున్న ఆ విశేషాలేంటో ఇప్పుడు చూద్దాం.

**లంగా ఓణీలో తెలంగాణ పిల్ల శాన్వీ మేఘన:**

తెలంగాణ ప్రాంతానికి చెందిన శాన్వీ మేఘన తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారును మాయ చేస్తోంది. ఈ ఉగాది సందర్భంగా ఆమె లంగా ఓణీలో అదిరిపోయే ట్రెడిషనల్ లుక్ షేర్ చేసింది. ‘హ్యాపీ న్యూ ఇయర్’ అంటూ తన ఇన్స్టాగ్రామ్ ఫాలోవర్లకు విష్ చేసింది. రీసెంట్‌గా ‘అనగనగా ఒక రాజు’ సినిమాలో స్పెషల్ సాంగ్ తో సందడి చేసిన ఈ భామ, పండుగ వేళ పద్ధతైన దుస్తుల్లో మెరిసిపోతూ అందరి దృష్టిని ఆకర్షించింది. తన క్యూట్ యాక్టింగ్‌తో త్వరలోనే మరిన్ని మంచి ప్రాజెక్టులతో రాబోతోంది.

**వర్ష బొల్లమ్మ వెరైటీ విషెస్:**

‘ఊరిపేరు భైరవకోన’ సినిమాతో రీసెంట్‌గా సక్సెస్ అందుకున్న వర్ష బొల్లమ్మ, ఉగాది శుభాకాంక్షలను కొంచెం వెరైటీగా చెప్పింది. చీరకట్టులో అందంగా కనిపిస్తూనే.. “ఉగాది పచ్చడి తిని పిచ్చి తగ్గించుకోండి” అంటూ ఫన్నీగా ఇన్స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. ఆమె సెన్స్ ఆఫ్ హ్యూమర్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. సినిమాల్లో పక్కింటి అమ్మాయిలా కనిపించే వర్ష, ఈ ఉగాది ఫోటోల్లో మాత్రం చాలా గ్లామరస్‌గా, ట్రెడిషనల్‌గా కనిపిస్తూ నెటిజన్ల మనసు గెలుచుకుంది.

**పండుగ కళ తెచ్చిన తారలు:**

ఇక మొత్తానికి ఈ ఉగాది పర్వదినాన మన టాలీవుడ్ హీరోయిన్లు గ్లామర్ పక్కన పెట్టి, సంప్రదాయానికి పెద్దపీట వేశారు. వారి ఫోటోలు చూస్తుంటే తెలుగుతనం ఉట్టిపడుతోంది. అభిమానుల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించి ఇలా విష్ చేయడం వారి పట్ల ఉన్న ప్రేమను చాటుతోంది. ఇక ఈ పరాభవ నామ సంవత్సరంలో ఈ ముద్దుగుమ్మలందరూ మరిన్ని హిట్లు అందుకోవాలని, వారి కెరీర్ మరింత బ్రైట్‌గా ఉండాలని మనమందరం కోరుకుందాం.



సారా అర్జున్ అద్భుతమైన స్టైల్ స్టేట్‌మెంట్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com